సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 27 । జనవరి । 2024



ఆకట్టుకున్న శకటాలు
రిపబ్లిక్‌డే సందర్భంగా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వీటిలో కొన్నిటికి బహుమతులను అందజేశారు. -8లో



వైఎస్సార్‌సీపీలో చేరిక
కలికిరి మండలం టి.సండ్రావారిపల్లికి చెందిన 50 మైనార్టీ కుటుంబాలు ఎంపీ మిథున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 159 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	490	490
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 139.680 కిలోలు

జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న, ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



కార్యక్రమాలను వీక్షిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానమ్ తదితరులు

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- ఘనంగా గణతంత్ర వేడుకలు

రాయచోటి: అన్నమయ్య జిల్లా, రాయచోటి పోలీస్ పేరెడ్ మైదానంలో 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ అడుగులు పడుతున్నాయని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సందేశం ఇచ్చారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజా ప్రతినిధులకు, విద్యార్థినీ విద్యార్థులకు, అధికారులకు, పాత్రికేయులకు, జిల్లా ప్రజలకు ముందుగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 జనవరి 26 నుంచి ఏటా జాతీయ పండుగగా గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. మహనీయులను స్మరిస్తూ వారందరికీ ఘన నివాళులు అర్పించారు. వారి ఆశయాలను, లక్ష్యాలను స్వీకరించి ప్రజాసేవకు, దేశ, రాష్ట్ర, జిల్లా ప్రగతికి మనమందరం కృషి చేద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జిల్లా సమగ్రాభివృద్ధికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో సాధారణ వార్షిక వర్షపాతం 743.8 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకు 476.5 మిల్లీమీటర్లు నమోదైందన్నారు. జిల్లాలో జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ రామాపురం, జరికోన, వెలిగల్లు ప్రాజెక్టు, కలిబండ, బెస్తపల్లి ప్రాంతాలకు ఎత్తిపోతల ద్వారా రూ. 5,427 కోట్లతో పరిపాలన అనుమతులు వచ్చాయన్నారు. అతి భారీ వర్షాలకు దెబ్బతిన్న అన్నమయ్య ప్రాజెక్టుకు రూ. 788 కోట్లు, పింఛా ప్రాజెక్టుకు రూ. 84 కోట్లు ప్రాజెక్టుల పునః నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఇందులో రూ. 759 కోట్లు మంజూరు కావడంతో దాదాపు 40 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు.

- వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయంగా 2.6 లక్షల మంది రైతుల ఖాతాలకు రూ. 154 కోట్లు, పీఎం కిసాన్ పథకంలో 2.4 లక్షల మందికి రూ. 81 కోట్లు జమ చేశామన్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 49 వేల మందికి రూ. 9.89 కోట్లను వారి ఖాతాలలో జమ చేశారన్నారు. యాంత్రీకరణ ద్వారా 161 గ్రూపులకు రూ. 4 కోట్ల సబ్సిడీతో 100 ట్రాక్టర్లు, 370 పరికరాలు సరఫరా చేశామన్నారు. అలాగే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షల కొరకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాయచోటి, మదనపల్లి, తంబళ్లపల్లి, రాజంపేట, కోడూరులలో డాక్టర్ వైఎస్సార్‌ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశామన్నారు. పీలేరులో కూడా తవరలో ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేశామన్నారు.
- జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాల కింద ఈ ఏడాది రూ. 13 కోట్ల మేర ఆర్థిక ప్రణాళికలతో ఉద్యాన రైతులకు చేయూతనివ్వడానికి వివిధ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.
- జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి 12వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ అన్నారు. ఇప్పటి వరకు 6,761 మంది రైతులకు చెందిన 7300 హెక్టార్లలో డ్రిప్ పరికరాలను అందజేసినట్లు చెప్పారు.
- జిల్లాలో 8913 మంది రైతులు 13 వేల ఎకరాల్లో మల్బరీ పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పట్టుపంట ద్వారా రైతులు రూ.503 కోట్లు విలువైన 4254 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్లు పండించడం జరిగిందన్నారు.
- 8913 మంది రైతులు 13 వేల ఎకరాల్లో మల్బరీ పంటను సాగు చేస్తున్నారు.ఈ ఏడాది పట్టుపంట ద్వారా రైతులు 503 కోట్ల రూపాయలు విలువైన 4254 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్లు పండించారన్నారు.
- ఇళ్లులేని అర్హులైన పేదలందరికీ 2024 సంవత్సరం నాటికి పక్కా ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. జిల్లాలో రూ. 1421 కోట్ల అంచనా వ్యయంతో 525 జగనన్న కాలనీ లేఅవుట్లలో అన్ని రకాల మౌళిక వసతులతో 78935 గృహ నిర్మాణాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇందులో 29505 గృహ నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయన్నారు.
- డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా పథకం ద్వారా జిల్లాలోని పశువులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.
- జిల్లాలో 423 ఏఎంసీయూ కేంద్రాల ద్వారా 5188 మంది పాలు పోసే రైతుల ద్వారా ఒకరోజుకు 73453 లీటర్ల పాల సేకరణ చేయడం జరుగుతోందన్నారు. పాల సేకరణలో జిల్లా, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు.
- నూతన జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన రాయచోటి పట్టణంలో రూ. 600 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. వీటిలో చాలా వరకు నిర్మాణాలను పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే శాంతి భద్రతలను నిరంతరం కాపుడుతున్న జిల్లా ఎస్పీ, పోలీస్ సిబ్బందికి, న్యాయమూర్తులకు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న పాత్రికేయులు, పథకాల అమలులో జిల్లా యంత్రాంగానికి సహకరిస్తున్న జిల్లా ప్రజలందరికీ జిల్లా ఇన్‌చార్జ్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను కలెక్టర్ తెలిపారు.
- పోలీసు జాగిలాలు 'జూకీ, జూలీ, మ్యాగీలు'' చేసిన హార్డిల్ జంప్, నేరస్తులు వదిలి వెళ్లిన వస్తువులను పట్టుకోవడం, నేరస్తులను గుర్తించడం తదితరాలు చూపర్లను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. జాగిలాలు ప్రదర్శన వల్ల చప్పట్లతో అభినందించారు.
- సైన్యంలో చేరిన మహిళలు ప్రాణాలకు తెగించి శత్రువులతో పోరాడుతూ చూపెట్టిన నారీశక్తి ధైర్యసాహసాల ప్రదర్శన, అదే సైనిక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మిలే సుర్ మేరా తుమారా గీతానికి చేసిన నత్య ప్రదర్శన, సంబేపల్లె కేజీబీవీ పాఠశాల విద్యార్థులు జయహో.. జయహో అంటూ చేసిన బంద ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. రాయచోటికి చెందిన గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు చేసిన ప్రదర్శన దేశభక్తిని ప్రేరేపించాయి.
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ, డీఆర్‌ఓ, ఆర్డీఓలు, జిల్లా అధికారులు తదితరులు సందర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లు బాగున్నాయని కలెక్టర్ అభినందించారు. ఎలక్షన్ సెల్ స్టాల్‌కు ప్రథమ, మహిళా శిశు సంక్షేమం స్టాల్‌కు ద్వితీయ, ఉద్యానవన శాఖ స్టాలుకు తృతీయ బహుమతి కింద మెమెంటోలు ప్రదానం చేశారు. అనంతరం జాతీయ గీతాలాపనతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానమ్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, రాయచోటి పట్టణానికి చెందిన వివిధ ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ

పేద బిడ్డలకు చదువు భారం కాకుండా వారు చదువుకోవడానికి అన్ని రకాల అవకాశాలు కల్పిస్తూ ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేని విధంగా విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. అమ్మఒడి పథకం ద్వారా నాలుగు ఏళ్లలో రూ. 888.65 కోట్లను తల్లుల ఖాతాలలో జమ చేసినట్లు చెప్పారు. డిజిటల్ విద్యా విధానానికి నాంది పలికిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న 16 వేల మంది విద్యార్థులకు 56 కోట్ల రూపాయల ఖర్చుతో బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులను ఉచితంగా అందజేసిందన్నారు. నాడు–నేడు ద్వారా జిల్లా వ్యాప్తంగా రెండో దశలో రూ. 277 కోట్ల ఖర్చుతో 1016 ప్రభుత్వ పాఠశాలలు, 21 జూనియర్ కళాశాలలో 10 రకాల మౌలిక వసతుల కల్పన. జగనన్న విద్యా దీవెన క్రింద 2023 విద్యా సంవత్సరంలో జూలై నుండి సెప్టెంబర్ త్రైమాసికాలలో 29300 మంది విద్యార్థులకు రూ. 20.62 కోట్లు విద్యార్థుల ఖాతాలలో జమ చేశామన్నారు. జగనన్న వసతి దీవెనలో భాగంగా ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ కోర్సులు చదివే 34836 మంది విద్యార్థులు తల్లుల ఖాతాలకు రూ. 33.72 కోట్లు లబ్ధిని చేకూర్చిందన్నారు. విదేశీ విద్యా దీవెన పథకం క్రింద 10 మంది విద్యార్థులకు రూ. 92 లక్షలు, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం క్రింద ఆరు మంది విద్యార్థులకు రూ. 6.50 లక్షలు లబ్ధి అందజేశామన్నారు.

ముువ్వన్నెల జెండా రెపరెపలు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయంపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. శుక్రవారం ఉదయం ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ జెండాకు వందనం చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.



కేజీబీవీ పాఠశాల విద్యార్థినుల విన్యాసం



కలికిరి సైనిక్ స్కూలు విద్యార్థుల ప్రదర్శన



అధికారులతో విద్యార్థులు



గణతంత్ర వేడుకలను తిలకిస్తున్న విద్యార్థినులు

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

రాయచోటి అర్బన్/రాజంపేట: జిల్లాలోని పలువురు మున్సిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ గంగాప్రసాద్ తిరుపతి జిల్లా సుళ్లూరుపేటకు, అతని స్థానంలో మంగళగిరి –తాడేపల్లె కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న పి శ్రీనివాసరావును నియమించారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజంపేట మున్సిపల్ కమిషనరుగా ఎస్.రాంబాబు నియమితులయ్యారు. ఆయన చింతలపూడి మున్సిపల్ కమిషనరుగా ప్రసుతం పనిచేస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న జనార్దన్‌రెడ్డిని నాయుడుపేట మున్సిపల్ కమిషనరుగా బదిలీచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయ నూతన పాలక మండలి ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర దేవదాయశాఖ కర్నూలు వారి ఉత్తర్వుల మేరకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నోటీస్ వెలువడిన రోజు నుంచి 20 రోజుల్లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కర్నూలు డిప్యూటీ కమిషనర్, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, కృష్ణానగర్, కర్నూల్ జిల్లా కార్యాలయంలో సమర్పించాలని కోరారు. దరఖాస్తులు రాయచోటి శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో లభిస్తాయని చెప్పారు.

జిల్లా పోలీసు అధికారులకు పతకాలు

రాయచోటి: గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర డీజీపీ నుంచి పోలీస్ శాఖకు సంబంధించి మెడల్స్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ కృష్ణారావుల చేతుల మీదుగా జిల్లా పోలీస్ అధికారులు అందుకున్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు పి.జయతిరాజులమణి, ఎస్.లక్ష్మీనారాయణ, పి.భాస్కర్, పి.శంకర్, ఈ.నాగేంద్రలు మెడల్స్ అందుకున్న వారిలో ఉన్నారు.

కంచుకోటలో మరోసారి జెండా ఎగరేద్దాం

- ప్రభుత్వం చేసిన మంచిని ఇంటింటికీ తీసుకెళ్లండి
- కార్యకర్తల సమావేశంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి





సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి మదనపల్లె నియోజకవర్గం పార్టీకి కంచుకోట అని, ఎప్పటిలాగానే 2024 ఎన్నికల్లోనూ మరోసారి ఇక్కడ వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, ప్రతిపక్షాలను మట్టికరిపిద్దామని వైఎస్సార్ సీపీ లోక్‌సభ పక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, పీకేఎం–ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో..జ్యోతి ప్రజ్వలన చేసి, మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం.. కార్యకర్తలను ఉద్దేశించి ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ... రాయలసీమలో మరే నియోజకవర్గంలో లేనివిధంగా అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల్లో 100 శాతం ప్రజాప్రతినిధులను గెలుచుకున్న ఏకైక నియోజకవర్గం మదనపల్లె అన్నారు. ఇది గ్రామగ్రామాన ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల రెక్కల కష్టంతోనే సాధ్యపడిందన్నారు. తన జీవితంలో ఏమీ ఆశించకుండా ఇద్దరే ఇద్దరు తనకు ఏం కావాలన్నా చేశారని, వారిలో మొదట తన అమ్మానాన్న, తర్వాత స్థానంలో పార్టీ క్యాడర్ ఉందన్నారు. జీవితాంతం క్యాడర్‌కు రుణపడి ఉంటానన్నారు. కార్యకర్తల ఆశీస్సులు, వారి కష్టంతోనే ఇప్పటివరకు గెలిచామని, రాబోయే రోజుల్లో మీ ఆశీస్సులు పార్టీకి, జగనన్నకు, తనకు, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌కు అందించాలన్నారు.

నాలుగన్నరేళ్లలో కనీవినీ ఎరగని అభివృద్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏమి చేసిందని చెప్పే ప్రతిపక్షాలకు...నాలుగన్నరేళ్ల జగనన్న ప్రభుత్వంలో.. మదనపల్లెలో రూ.500కోట్లతో మెడికల్ కాలేజి నిర్మాణాన్ని ప్రారంభించామని, పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో తరగతులు, ఆస్పత్రి ప్రారంభమవుతోందని, సిబ్బంది నియామకం జరుగుతోందన్నారు. ఎస్వీ.యూనివర్శిటీ, వెంకన్న ఆలయంతో తిరుపతి ఎలాగైతే దినదినాభివృద్ధి చెందిందో, అలాగే మదనపల్లెలోని బీటీ కాలేజీని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా.. యూనివర్శిటీ స్థాయి పెంపుకు ఈనెల 30న క్యాబినెట్‌లో జీఓ వెలువరించడం జరుగుతోందన్నారు. అలాగే కేంద్రీయ విద్యాలయం..వీటన్నింటితో.. మన పిల్లలు ఇక్కడే చదువుకునేలా, ఉన్నత స్థానాలకు ఎదిగేలా, పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో మాట్లాడి జగనన్న మదనపల్లె–తిరుపతి, కదిరి–మదనపల్లె ఫోర్‌లేన్ రహదారిని మంజూరుచేశారని, పనులు కళ్లముందే జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల్లో నియోజకవర్గంలో మరెవ్వరూ వేయనంతగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.300కోట్లతో ప్రతి గ్రామంలోనూ తారు, సీసీ రోడ్లు వేశామన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు సొంతనియోజకవర్గానికి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉంటే జగనన్న ప్రభుత్వంలో కుప్పానికి హంద్రీనీవా నీళ్లు ఇస్తున్నామన్నారు. ఎన్నికల్లో ప్రతిపక్షనాయకులు ఇచ్చే అబద్ధపుహామీలను, ప్రజలను మోసగించే విధానాలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ గెలుపుకు కృషిచేయాల్సిన బాధ్యత మీదేనన్నారు.

కులసమీకరణాల్లో మైనార్టీ అభ్యర్థి ఎంపిక

రాజంపేట పార్లమెంటరీ పరిధిలో 2.50లక్షల మైనారిటీలు ఉన్నారని, నియోజకవర్గంలో పార్టీ తరపున జరిపిన సర్వేలన్నింటిలోనూ మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డికి ప్రథమస్థానం వచ్చినప్పటికీ, కులసమీకరణల్లో భాగంగా...మైనారిటీలను గౌరవించేందుకు నిసార్‌అహ్మద్‌కు అవకాశం కల్పించారన్నారు. మంచివ్యక్తి, నిగర్వి, మనిషి విలువ తెలిసిన నిసార్‌అహ్మద్‌కు కార్యకర్తలందరి ఆశీస్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి, ఎంపీపీలు కుసుమకుమారి, రెడ్డెమ్మ, నరసింహులు, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బి.శశాంక్‌రెడ్డి, లియాఖత్‌అలీ, సుజనాబాల కృష్ణారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జబ్బులశ్రీనివాసులు, ఎస్.మస్తాన్‌ఖాన్, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, క్రైస్తవ విభాగం బోనాసిజాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా విభాగాల నూతన కమిటీ ఏర్పాటు

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల విభాగాల నూతన కమిటీలను ప్రకటించింది. సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతన విభాగ కమిటీలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. మహిళ విభాగంలో జిల్లా అధ్యక్షురాలుగా తంబళ్లపల్లెకు చెందిన డాక్టర్ అనితా చక్రవర్తి, ఉపాధ్యక్షురాలిగా జె. కల్పన (రాయచోటి), తాడిపత్రి లక్ష్మీదేవి (పీలేరు) జనరల్ సెక్రటరీలుగా సరళ (పీలేరు), ఎస్‌కె ఫర్వీన్ (రాయచోటి), శ్రీవాణిరెడ్డి (రాజంపేట), నగీనాబేగం (తంబళ్లపల్లె), ఏవి అపర్ణ (మదనపల్లె)తో పాటు ఎనిమిది మంది సెక్రటరీలు, మరో ఎనిమిది మంది జాయింట్ సెక్రటరీలుగా నియమిస్తూ కమిటీని ప్రకటిచింది.
ఎస్సీ విభాగం: జిల్లా ఎస్సీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా ఎం. రవీంద్ర (పీలేరు) ఉపాధ్యక్షుడిగా చుక్కా అంజన్నప్ప (రాయచోటి), జనరల్ సెక్రటరీగా యమరపు బాబు (రాయచోటి), ఎం. నరేష్ (పీలేరు), కె. సుబ్రహ్మణ్యం (మదనపల్లె), మోహన్ (తంబళ్లపల్లె)లతో పాటు ఎనిమిది మందిని సెక్రటరీలుగాను, మరో ఎనిమిది మందిని జాయింట్ సెక్రటరీలుగా నియమించింది.
ఎస్టీ విభాగం: జిల్లా ఎస్టీ విభాగపు కమిటీ అధ్యక్షులుగా బుక్కె శ్రీనివాస నాయక్ (తంబళ్లపల్లె) ఉపాధ్యక్షులుగా బి. మురళీ నాయక్ పీలేరు), రామచంద్రానాయక్ (రాయచోటి), జనరల్ సెక్రటరీలుగా బి. ఉమ్లానాయక్ (తంబళ్లపల్లె), ఎం. చంద్రా నాయక్ (పీలేరు), బి. శివశంకర్ నాయక్ (మదనపల్లె) మోడే తిరుపాల్‌నాయక్ (రాయచోటి)లతో పాటుఎనిమిది మంది సెక్రటరీలుగా, మరో ఎనిమిది మంది జాయింట్ సెక్రటరీలుగా నియమాకం చేసింది.

నేడు నగరవనం ప్రారంభం

రాయచోటి: ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చేరువ చేసేందుకు రాయచోటి పట్టణ పరిధిలో నగరవనం అభివృద్ధి చేస్తున్నారు. సుమారు 80 ఎకరాల్లో అటవీ అధికారుల ఆధ్వర్యంలో నిర్మించిన నగరవనాన్ని శనివారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. రాయచోటి–గాలివీడు మార్గంలోని వంటిమామిడి చెట్టు సమీపం నుంచి నగరవనానికి ప్రత్యేక దారి ఏర్పాటు చేశారు. ఇందులో 3.5 కిలో మీటర్ల మేరకు వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్, ఆర్‌ఓ ప్లాంట్, షెడ్లు, కార్తీక వనం, నవగ్రహ వనం, నక్షత్ర వనం, రోజ్ గార్డెన్, ట్రెక్కింగ్, నర్సరీ, వాటర్ పంప్ తదితర పనులు పూర్తయ్యాయి. ఫారెస్టు కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ మధుసూదన్ రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు.

ప్రారంభానికి సిద్ధమైన నగరవనం →



త్వరితగతిన కారుణ్య నియామకాలు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కారాన్ని జెడ్పీ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అమరులయ్యాక దేశ స్వాతంత్ర్యం లభించిందన్నారు. అప్పటి నుంచి వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, రహదారులు, మౌలిక వసతులు అభివృద్ధి అయ్యాయన్నారు. జిల్లా పరిషత్ పరిధిలో ఆలస్యం లేకుండా కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికి 54 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, 40 మందికి వివిధ క్యాడర్లలో పదోన్నతి కల్పించామని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 22 సీపీడబ్ల్యూఎస్ పనులకు 27.19 కోట్ల రూపాయలు మంజూరు చేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

భూమి విషయమై ఘర్షణ

మదనపల్లె సిటీ : భూమి విషయమై జరిగిన గొడవలో ముగ్గురు గాయపడిన సంఘటన పెద్ద తిప్పసముద్రం మండలంలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు... మండలంలోని ముంతగోగులపల్లెకు చెందిన గోపాల్ కుటుంబ సభ్యులు ఇదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుటుంబ సభ్యుల నుంచి 30 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి పట్టా కూడా వచ్చింది. అయితే ఈ స్థలం తమకు చెందుతుందని శ్రీనివాసులు కుటుంబ సభ్యులు గొడవపడ్డారు. ఈ గొడవలో శ్రీనివాసులు కుటుంబ సభ్యులు.. గోపాల్ భార్య వెంకటరమణమ్మ(30), రమేష్ భార్య రేణుక(31), రెడ్డప్ప భార్య రేణుకదేవి(28)పై దాడి చేసి కొట్టారు. ఈ గొడవలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు మహిళలను వారి కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అవుట్‌పోస్టు సిబ్బంది సమాచారాన్ని పెద్దతిప్పసముద్రం పోలీసులకు తెలియజేశారు.

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

రాయచోటి : రాయచోటి పట్టణం రాజుల కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ (30) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. గత కొంత కాలంగా కుటుంబ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కుటుంబసభ్యులు చెప్పారు. ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతుడు మహమ్మద్ వీరబల్లి మండలం సీతంపేటలో వలంటీర్‌గా పనిచేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె సిటీ : రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం ఎర్రాతివారిపల్లెకు చెందిన రెడ్డప్ప(40) మదనపల్లెలోని శేష్‌మహల్ ఏరియాలో యూపీహెచ్‌సీలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య భానుమతి (35) మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. వీరిద్దరూ బైక్‌పై మదనపల్లెకు వస్తుండగా.. మాచిరెడ్డిగారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన దంపతులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు విచారణ చేస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు గ్రామానికి చెందిన నరసింహులు కుమారుడు నిఖిల్(6) పాఠశాలలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలకు వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు.. రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆ బాలుడిని పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు పెద్దతిప్పసముద్రం పోలీసులకు సమాచారం అందజేశారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



మున్సిపల్ శాఖ శకటం



డ్వామా శకటం

రాయచోటి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి శకటాల ప్రదర్శన కనువిందు చేసింది. ఈ వేడుకలను రాయచోటిలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించారు. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, యువజన సర్వీసులు, రవాణా, రెవెన్యూ, దిశ, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, గృహ నిర్మాణం, అటవీ, అగ్నిమాపక, విద్యుత్, నెడ్‌క్యాప్, విద్య, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, పశుసంవర్ధక, వ్యవసాయ తదితర శాఖలు తమ శకటాలను ప్రదర్శించాయి. ఇవి అధికారులు, సందర్శకులను ఆకట్టుకున్నాయి. వీటిలో అత్యుత్తమంగా ఉన్న శకటాలకు బహుమతులను ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అందజేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా), రాయచోటి మున్సిపాలిటీ, వ్యవసాయ, ఉద్యాన శాఖలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, గృహ నిర్మాణశాఖకు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అలాగే వీరగాథకు సంబంధించి అత్యుత్తమ ప్రదర్శన చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం

సీనియర్ సిటిజన్స్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ కష్ణారావు కలిసి సన్మానించారు. రామాపురం మండలానికి చెందిన గగ్గుటూరు బాసు(85), అదే మండలానికి చెందిన బండపల్లి పెద్దనాగన్న(75)లను వారు సత్కరించారు.



పెద్ద నాగన్న, బాసు సన్మాన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ



రైతు భరోసా శకటం



గృహ నిర్మాణ శాఖ శకటం



వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష శకటం



విద్యాశాఖ శకటం

• ఉత్తమ సేవకు ప్రశంస

ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాయచోటి పోలీస్ పరేడ్ మైదానం ఇందుకు వేదికైంది. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.



జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్డీఓ రంగస్వామి



మల్లికార్జున, ఎస్‌బీసీ, రాజంపేట



గోపాలకృష్ణ, ఎస్‌డీసీ, పీలేరు



అనిల్‌కుమార్, అగ్నిమాపకశాఖ అధికారి



జయరాజు, జిల్లా సర్వే అధికారి



గుణశేఖర్‌పిళ్లై, పశుసంవర్ధకశాఖ అధికారి



రాజారెడ్డి, పట్టుపరిశ్రమలశాఖ అధికారి



కొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



డేవిడ్ సుకుమార్, వైద్య ఆరోగ్యశాఖ



సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ



జాకీర్ హుసేన్, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి



కిరణ్‌కిశోర్, ఆర్‌జేడీ



సహదేవరెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి



దనలక్ష్మి, పంచాయతీ రాజ్ అధికారి



చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎస్ పీడీసీఎల్



నాగరాజు, ఏపీఐఐసీ అధికారి



గురుస్వామి, రాయచోటి సబ్‌రిజిస్ట్రార్



భరత్‌కుమార్, డీఐపీఆర్‌ఓ



నరసింహారెడ్డి, స్కౌట్స్ గైడ్స్ సెక్రటరీ

నవశకం

ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగా తీసుకోవడం జరిగింది. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రావాలంటే మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకునేవాళ్లం. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అన్నీ కూడా ఉచితంగా సచివాలయం ద్వారా అందజేస్తున్నట్లు వలంటీర్ ప్రవీణ్ చెప్పాడు. దీంతో మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. అంతేకాకుండా ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు తీసుకున్నాము. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కూడా అర్హులైన వారికి ఇస్తుండటంతో.. మేము ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటాం.

– బాదిరెడ్డి రత్నమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం, వైఎస్ఆర్ జిల్లా

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో ప్రవేశపెట్టి పేద పిల్లలు ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. 3, 4, 5 తరగతుల విలీనం ద్వారా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను, డిజిటల్ విద్యా విధానం కోసం తరగతి గదుల్లో ఐఎఫ్‌బీ, టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఉండాల్సిన పాఠ్యాంశాలు, బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, బాలికలు పాఠశాలకు గైర్హాజరు కాకుండా స్వేచ్ఛ పథకం ద్వారా నాప్‌కిన్స్ అందజేత, విద్యార్థులకు రాగి జావ, జగనన్న విద్యా కానుక, నాడు–నేడుతో అద్భుతమైన ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం ఏర్పడడమే కాకుండా ఉత్తమ బోధన లభిస్తోంది.

– అన్నయ్య, బీసీ కాలనీ, గోరాన్‌చెరువు గ్రామం, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా

సొంతిల్లు కట్టుకున్నాం



మేము తెలుగు దేశం పార్టీలో ఉన్నప్పటికీ.. అప్పటి ప్రభుత్వంలో నాకు ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఇంటితోపాటు స్థలం మంజూరైంది. ఇల్లు కట్టుకొని హాయిగా జీవిస్తున్నాము. మాకు చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నడివీధి శశికళ, ఎస్సీ కాలనీ, వంతాటిపల్లి, సిద్దవటం మండలం, అన్నమయ్య జిల్లా

పచ్చపత్రికలు విషపురాతలు మానుకోవాలి

- గతంలో గనులను దోపిడీ చేసింది టీడీపీనే
- నిజాయితీగా కాపాడింది వైఎస్సార్‌సీపీనే
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలంలో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన మంగంపేట బెరైటీస్ గనులను 2014–19లో అధికారంలో ఉన్న చంద్రబాబు.. తన అనుచరులకు దోచిపెట్టడానికి ఎటువంటి పారదర్శకత లేకుండా టన్ను 2 వేల రూపాయలు ఉండే దాన్ని 1200లకే నిర్ణయించి దోపిడీ చేసి గనులను నాశనం చేశారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పచ్చపత్రికలు కులపిచ్చితో చంద్రబాబు కోరల్లో నుంచి.. రాష్ట్ర ప్రజలు, మంగంపేట గనులపై విషం కక్కుతున్నాయని పేర్కొన్నారు. మొదటగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలనలో మంగంపేటలోని స్థానికులను, పరిశ్రమలను కాపాడటానికి.. స్థానికులకు, ఎగుమతులకు 60:40 శాతం చొప్పున ముగ్గురాయి అందించి ఎంతో మేలు చేశారన్నారు. ఆ తరువాత వచ్చిన చంద్రబాబు తన అనునాయులకు దోచిపెట్టడానికి మంగంపేటను భ్రష్టుపట్టించి.. ఎటువంటి జీవోలు లేకుండా ఇష్టం వచ్చిన ధరలకు ముగ్గురాయిని కట్టబెట్టి దోపిడీకి పాల్పడ్డారని, ఆ విషయం కనపడలేదా అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మంగంపేటకు పూర్వవైభవం తీసుకువచ్చారని, ప్రతి కార్మికుడిని ఆదుకునే, స్థానికులకు న్యాయం చేసే విధంగా, పునరావాసులను అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలియజేశారు. మంగంపేటలో గడిచిన కొన్ని సంవత్సరాలలో తక్కువ సమయంలోనే మంగంపేట కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ, అగ్రహారంలోని పునరావాసం కల్పిస్తూ.. యుద్ధప్రాతిపదికపైన 456 వందల కోట్లతో ఇల్లు కట్టించడం, అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నిజాయితీగా, నిబద్ధతగా అన్నీ ఆన్‌లైన్‌లో పెడుతూ జీవో విడుదల చేశారని, వృథాగా ఉన్న సీ గ్రేడ్ ఖనిజాన్ని విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. మా ప్రభుత్వంలో ప్రతి ఒక్కటీ చట్టబద్ధంగా, ప్రతి ఒక్కరూ చూసుకునే విధంగా ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో పాడిఆవులు, గొర్రె మృతి

శోకసంద్రంలో రైతు కుటుంబం

రామసముద్రం : అనుమానాస్పద స్థితిలో నాలుగు పాడి ఆవులు, ఒక గొర్రె మృతి చెందిన సంఘటన రామసముద్రంలో మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం పంచాయతీ శీతరగానిపల్లికి చెందిన వెంకటప్ప కుటుంబానికి నాలుగు పాడి ఆవులు, 50 గొర్రెలు ఉన్నాయి. వాటిని మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోజు లాగానే ఉదయం పాడి ఆవులకు వెంకటప్ప, కోడలు నాగమ్మ దాణాబూస, కుడితి నీళ్లు పెట్టారు. అందులో ఒక గొర్రె కూడా కుడితి నీరు తాగింది. కుడితి నీరు తాగిన కొంతసేపటికి పాలు పితికేందుకు కుటుంబీకులు వెళ్లగా.. తొలుత గొర్రె గిలగిల కొట్టుకుంటూ మృతి చెందింది. అంతలోనే ఒక్కొక్క పాడి ఆవు నేలకొరిగి గిలగిల కొట్టుకోవడంతో భయాందోళనకు గురైన రైతు కుంటుంబీకులు ఏమైందో అని అర్థం కాక నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. వెంటనే రామసముద్రం పశు వైద్యశాలకు సమాచారం అందించగా.. వెటర్నరీ అసిస్టెంట్ జగదీష్ వచ్చే సరికి మూడు ఆవులు మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న ఒక పాడి ఆవుకు వైద్యం అందించాడు. వైద్యం అందిస్తుండగా ఆ పాడి ఆవు కూడా మృతి చెందింది.



మృతి చెందిన పాడి ఆవు



మృతి చెందిన గొర్రె

రూ.5 లక్షల నష్టం

ఒక్కొక్క పాడి ఆవు సుమారు రూ.లక్ష వరకు విలువ చేస్తాయని రైతు వెంకటప్ప కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఒక్కొక్క ఆవు పూటకు 10 వరకు పాలు ఇచ్చేవని, రోజుకు 70 నుంచి 80 లీటర్లు పాలు పోసే వారిమని వాపోయారు. పాలతో జీవనం సాగించే వారిమని పేర్కొన్నారు. ఒకే సారి అన్ని పాడి ఆవులు మృతి చెందడంతో రైతు కుటుంబం వీధిన పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. కాగా చనిపోయిన పాడి ఆవులకు బీమా వర్తించకపోవడంతో రైతు కుటుంబం మరింత డీలా పడింది.

వ్యభిచార గృహంపై దాడి

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం మార్వురివీధిలో ఓ వ్యభిచార గృహంపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు నిర్వాహకులతోపాటు ఇద్దరు విటులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఓబులవారిపల్లె : మండల పరిధి కొర్లకుంట అడ్డరోడ్డులో విక్రయిస్తున్న 100 మద్యం బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వల్లి తెలిపారు. ప్రభుత్వ మద్యం షాపు పక్కనే ఉన్న కూల్ డ్రింక్స్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకొని.. దాడి చేసి వంద మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు. దాడుల్లో కానిస్టేబుల్స్ ఉపేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 50 టీడీపీ కుటుంబాలు



వాల్మీకిపురం: ఎంపీ మిథున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మైనార్టీలు



మదనపల్లె: ఎంపీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న రాటకొండ నవీన్

వాల్మీకిపురం : కలికిరి మండలం టి.సంగ్రావారిపల్లికి చెందిన టీడీపీ నుంచి 50 మైనార్టీ కుటుంబాలు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లి హరీష్‌రెడ్డి అతిథి గృహంలో శుక్రవారం చేరిన వీరికి ఎంపీ మిథున్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో బావాజి, చాన్‌బాషా, రాజా, ఇంతియాజ్, అక్బర్, కాలేషా, బాబు, మస్తాన్, మహబూబ్‌బాషా, రాజు, హసీన, అస్మాన్, మస్తాని, రేష్మా, షబానా, కుర్మాన్, ప్యారీ, ఖాదర్ బాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని తెలిపారు. నవరత్నాల ద్వారా ప్రజలకు నేరుగా పథకాలను వారి ఖాతాల్లో జమ చేస్తూ.. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జునరెడ్డి, చైతన్యరెడ్డి, నల్లంకి నరసింహులు, శీనా, భాస్కర్‌రెడ్డి, జోహార్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకుడు రాటకొండ నవీన్

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారని, వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం మదనపల్లె పట్టణం మిషన్‌కాంపౌండ్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో ఎంపీ మిథున్‌రెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్ సమక్షంలో మార్వారివీధికి చెందిన టీడీపీ నాయకులు రాటకొండ నవీన్, తన స్నేహితులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, మైనారిటీ నాయకులు లియాఖత్‌అలీ, ఎస్.మస్తాన్‌ఖాన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.